సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



రైల్వే జీఎంతో ఎంపీ అవినాష్‌రెడ్డి భేటీ
సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్‌తో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. రైల్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. -8లో



ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్ష
కలసపాడు పరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు కారణమైన కేసులో ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ తీర్పునిచ్చారు. -8లో



వంద రోజుల్లో ఒక్క మంచిపని చేశారా?
వంద రోజుల పాలనలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఒక్క మంచి పనీ చేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్/ చక్రాయపేట: కడప, చక్రాయపేటలోని ప్రభుత్వ ఐటీఐలలో శుక్రవారం వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 60 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళాలను ఆయన పర్యవేక్షించారు. ఇందులో మొత్తం 149 మంది హాజరు కాగా అర్హతలు, అనుభవాన్ని బట్టి అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు.

వైద్య సేవల ప్రగతిలో జిల్లాకు ‘ఏ’ గ్రేడ్

కడప రూరల్: వైద్య సేవల ప్రగతిలో రాష్ట్ర స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ‘ఏ’ గ్రేడ్ లభించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ఔట్ పేషెంట్లు, ఇన్‌పేషంట్స్, సాధారణ ప్రసవాలు, ల్యాబొరేటరీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సాధనాలు చేయించుకున్న వారి సంఖ్యను బట్టి ఆరోగ్య సేవలను అందించడంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ‘ఏ’ గ్రేడ్ (ప్రథమస్థానం)లో నిలిచింది. వైద్య సేవల ప్రగతిలో ఏ–గ్రేడ్ రావడం పట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. సిబ్బందికి అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ డ్రైవ్



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, తదితరులు

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం బెంగళూరు ట్యాప్ అకాడమి ఆధ్వర్యంలో బీటెక్ నాల్గవ సంవత్సర విద్యార్థులకు క్యాంపస్ టు కార్పొరేట్ ఇంటర్న్‌షిప్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 230 మంది విద్యార్థులు ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరయ్యారు. వీరిలో పది మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చారని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాధాకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ రాధాకృష్ణలు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

దోమల నివారణకు చర్యలు



డ్రమ్ములో దోమలను పరిశీలిస్తున్న మనోరమ

పోరుమామిళ్ల: మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మలేరియా అధికారిణి మనోరమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలో ల్యాబొరేటరీ రికార్డులు, రిపోర్టులు, రక్త నమూనాలు, కంప్యూటర్ పరిశీలించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జ్వరాలు, మలేరియా, ఫైలేరి యా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల గురించి విచారించారు. ప్రతి శుక్రవారం డ్రైడే అమలుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటిలో దోమకాటుకు గురికాకుండా ఉండాలంటే దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఆరోగ్య విద్యాధికారులు సాధు వెంకటేశ్వర్లు, సరస్వతి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ‘బి’ సర్టిఫికెట్లు ప్రదానం



ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచిన కేడెట్స్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కల్నల్

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం తిరుపతి 5 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ప్రవేశాల ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 5 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అనూజ్ వాద్వా విచ్చేసి ఎంపికలను పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సలీం బాషా మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థినులను ఎన్‌సీసీలో ప్రవేశాలకు ఎంపిక చేశారు.

ఎన్‌సీసీ ‘బి’ సర్టిఫికెట్‌లు ప్రదానం
మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్‌కు సంబంధించి ‘బి’ సర్టిఫికెట్ ఫలితాలను విడుదల చేయడంతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఎన్‌సీసీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కేడెట్స్‌కు కల్నల్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ బి.స్వరూప పాల్గొన్నారు.

ధరల దడ..
సామాన్యుడు విలవిల!

■ కడప హౌసింగ్‌బోర్డుకు చెందిన శివప్రసాద్ టిఫెన్ బంకు పెట్టుకొని తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. టిఫెన్ సెంటర్ నిర్వాహణ ఖర్చులు పోనూ సరాసరిగా ప్రతిరోజు రూ.600 ఆదాయం గడిస్తున్నారు. ఈలెక్కన నెలకు రూ.18 వేలు ఆదాయం లభిస్తోంది. అద్దె ఇల్లు బాడుగ రూ.5 వేలు, కరెంటు, గ్యాస్ ఖర్చులు రూ.2 వేలు, పిల్లల స్కూల్ ఫీజులు రూ.3 వేలు, నిత్యావసర వస్తువులు రూ.5వేలు, ఫోన్లు రీఛార్జీ, పెట్రోల్‌కు రూ.2వేలు ప్రతినెలా ఖర్చులు భరిస్తున్నారు. ఇటీవల నిత్యావసర వస్తువులు భారీగా పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు శివప్రసాద్ వాపోతున్నారు.


■ అక్కాయపల్లెకు చెందిన రాము ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రతిరోజు వెయ్యి రూపాయలు ఆటో నిర్వాహణ ద్వారా లభిస్తోంది. ఆటో బాడుగ రూ.250, డీజల్‌కు రూ.250 ఖర్చులు పోనూ సరాసరిగా నెలకు రూ.15వేలు ఆదాయం గడిస్తున్నారు. జగనన్న ఇల్లు ఉన్నప్పటికీ నిత్యావసర వస్తువులు పెరగడంతో ఖర్చులకు సర్దుబాటు కష్టంగా మారిందని వాపోతున్నాడు. వేడినీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్లుగా వ్యక్తిగత ఆదాయానికి ప్రభుత్వ తోడ్పాటు ఉండేది. అర్హత ఉన్నా ఇప్పుడా అవకాశం కోల్పోయామని రాము వాపోతున్నాడు. అమ్మ ఒడి పథకం, వాహనమిత్ర, వైఎస్సార్ ఆసరా ఇలా ఏదో ఒక విధంగా లభించే సొమ్ముతో కుటుంబ పోషణ సజావుగా సాగేదని వివరిస్తున్నాడు.

- భారంగా నిత్యావసర వస్తువులు
- కొండెక్కిన కందిపప్పు
- పులుపెక్కిన చింతపండు
- కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి
- కాగుతున్న వంట నూనెలు









సాక్షి ప్రతినిధి, కడప: గడిచిన మూన్నెళ్లుగా సామాన్యుల జీవనం భారంగా మారింది. కందిపప్పు కొండెక్కింది. కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. వంటనూనెలు కాగిపోతున్నాయి. వచ్చే ఆదాయం కంటే ఖర్చులు అధికమయ్యాయి. ప్రభుత్వ పథకాలు ద్వారా లభిస్తోన్న ఆర్థిక భరోసా నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. వెరశి సామాన్యులు (పేదలు, మధ్యతరగతి) విలవిల లాడుతున్నారు.

ఆకాశాన్ని అంటిన ధరలు...
కిలో కందిపప్పు రూ.173, కిలో ఎండుమిర్చి రూ.220, తెల్లగడ్డలు రూ.300, చింతపండు రూ.140 ఇలా నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. పేద, మధ్యతరగతి జీవనశైలి భారంగా మరింది. పచ్చడి మెతుకులు తిందామన్నా ఉల్లిగడ్డ కన్నీళ్లు తెప్పిస్తోంది. వంట నూనెలు మండిపోతున్నాయి. వేరుశనగ నూనె ఏకంగా రూ.160 చేరింది. కూరగాయలు కిలో రూ.40 తక్కువ లేకుండా ఉండిపోయాయి. ఆకుకూరలు అగ్గి కురుస్తున్నాయి. నిత్యావసర ధరల నియంత్రణ లేదు. మార్కెట్‌లో దళారులదే రాజ్యమైంది. పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోగా, రిటైల్ వ్యాపారులు భారీగా ఆర్జిస్తున్నారు.

కనుమరుగైన ప్రభుత్వ తోడ్పాటు...
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ సామాన్యులకు అండగా నిలిచింది. క్రమం తప్పకుండా ఆర్థిక తోడ్పాటు ఇచ్చేది. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు చేర్చేది. తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు అదుపుతప్పినా సామాన్యుల జీవనం ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సాగేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. జూన్ నెలలో అమ్మ ఒడి పథకం, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), జూలైలో జగనన్న విదేశీ విద్యా దీవెన (మొదటి విడత), వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు (మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కళ్యాణమస్తు–షాదీతోఫా (రెండో(త్రైమాసికం) ఆగస్టులో జగనన్న విద్యా దీవెన (రెండోవిడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర, సెప్టెంబర్‌లో వైఎస్సార్ చేయూత లభించేది. ఆయా పథకాల ద్వారా లక్షల మందికి నేరుగా లబ్ధి చేకూరేది. చంద్రబాబు సర్కార్ సంక్షేమాన్ని విస్మరించడంతో నిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో జీవనం భారంగా మారిందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు (రూ.లలో)

కందిపప్పు	173(కిలో)	తెల్లగడ్డలు	300
శనిగపప్పు	100	ధనియాలు	120
పెసలు	130	అలసంద	110
మినుము	125	నువ్వులు	170
ఎండుమిర్చి	220	ఉల్లిగడ్డలు	60
చింతపండు	140	పామాయిల్	95
వేరుశనగ నూనె	160	సన్‌ఫ్లవర్ ఆయిల్	112

పెరిగిన ధరలతో ఇబ్బందులు...



నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. నేను టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాను. పెరిగిన ధరలతో ఇబ్బందిగా ఉంది. – బి.రాజేష్, ఎంఎస్ టిఫిన్ సెంటర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కడప

ఇల్లు గడవడం కష్టం



నిత్యావసర సరుకులతో నిత్యం పని ఉంటుంది. ఈ సరుకుల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతాయి. – సుబ్బమ్మ, లోహియానగర్, కడప

ఏమీ కొనలేకున్నాం



పెరిగిన ధరల కారణంగా ఏ వస్తువును కొనలేని పరిస్థితి ఏర్పడింది. అన్ని రకాల సరుకుల ధరలు పెరిగాయి. ధరలు ఇలాగే ఉంటే ఏమీ కొనలేం...తినలేం. – పి.రోజా, కృపా కాలనీ, కడప

ధరలు తగ్గించాలి..



కేవలం నెల, రెండు నెలల కాలంలోనే ధరల పెరుగుదల కనిపిస్తోంది. పెరిగిన ధరలతో ఏం కొనాలన్నా భయమేస్తోంది. ధరలు తగ్గించాలి. – ముంజుల, ఎర్రముక్కపల్లె, కడప

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కమలాపురం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కలెక్టర్ లోతేటి శివ శంకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పొడదుర్తిలో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డితో కలసి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు తదితర కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో రూ.16 కోట్లతో ఎంజీఎన్‌ఆర్‌ఎస్ పనులు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం పొడదుర్తి గ్రామానికి రోడ్లు, డ్రైనేజ్‌కు నిధులు కావాలని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన తక్షణం రూ.5 లక్షలు మంజూరు చేశారు. అంతకు ముందు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎమ్మెల్యేతో కలసి వై.కొత్తపల్లె పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ శివరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత రంగానికి ఆయువుపట్టుగా టెక్స్‌టైల్ పార్క్

- మైలవరం టెక్స్‌టైల్ పార్క్‌లో ప్లాట్‌ల కేటాయింపు కోసం లాటరీ
- కలెక్టర్ శివ శంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : మైలవరం టెక్స్‌టైల్ పార్క్‌ను జిల్లా చేనేత జౌళి రంగానికి ఆయువు పట్టుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేనేత సంఘాలకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మైలవరం టెక్స్ టైల్ పార్క్ లో చేనేత జౌళి యూనిట్ల స్థాపన కోసం లాటరీ పద్ధతి ద్వారా వాటాదారులకు (స్టేక్ హోల్డర్లకు) ప్లాట్లను కేటాయించే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో మైలవరం టెక్స్ టైల్ పార్క్‌కు మంచి రోజులు రానున్నాయన్నారు. 2005–2006లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మైలవరంలో 62.18 ఎకరాల స్థలాన్ని టెక్స్ పార్కు ఏర్పాటుకు కేటాయించిందన్నారు. ఇందులో డైయింగ్ యూనిట్స్ – 21, గార్మెంట్ యూనిట్స్ – 32, పవర్ యూనిట్స్ – 37, హ్యాండ్లూమ్ యూనిట్స్ –12 హ్యాండ్లూమ్స్, పవర్ లూమ్ యూనిట్స్ – 16 తో కలిపి మొత్తం –118 యూనిట్స్ ను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు వాటాదారుల నుండి దరఖాస్తులను స్వీకరించామన్నారు. అందుకోసం ప్రాథమిక చెల్లింపు (ఇనిషియల్ పేమెంట్) కింద రూ. 50 వేలను సెప్టెంబర్ 17వ తేదీలోపు పేమెంట్ చేసిన వారందరికీ శుక్రవారం లాటరీ తీశామన్నారు. లాటరీలో ప్లాట్ సొంతం చేసుకున్న మొత్తం 93 మందికి అదే రోజు నుండి యూనిట్స్ ప్రారంభించడానికి తాత్కాలిక హక్కును కల్పించామన్నారు. ప్లాట్ అలాట్‌మెంట్ అయిన వారు నెలలోపు ప్లాట్ ఖరీదు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా ఆరు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించుకోవాలన్నారు. ఈ టెక్స్ టైల్ పార్కు యూనిట్స్ ఏర్పాటుకు చేనేత కార్మికులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా పీఎంఈజీపి ద్వారా సబ్సిడీతో రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కూడా అందుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్లాట్లను సొంతం చేసుకున్న వాటాదారులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, చేనేత జౌళిశాఖ ఆర్ఎం రాజారావు, ఏడీ నాగరాజారావు, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ డిప్యూటీ జెడ్ఎం మాధవీలత, చేనేత కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోల్ సెంటర్‌పై టీడీపీ కన్ను..!



ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలించి అప్పనంగా ఆదాయం ఆర్జిస్తున్న తెలుగుతమ్ముళ్లు ఇపుడు స్తంభాల తయారీ కాంట్రాక్టర్లపై దృష్టి పెట్టారు. తమ వారే ఉండాలంటూ పోల్ సెంటర్ నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకొనేందుకు పావులు కదుపుతున్నారు.

- రాజీనామా చేయాలని తీవ్ర ఒత్తిడి
- కమలాపురం కాంట్రాక్టర్‌పై కన్నెర్ర
- తెలుగు తమ్ముళ్లకు ఇచ్చేందుకు సన్నాహాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలోని కమలాపురం, సిద్ధవటంలో విద్యుత్తు స్తంభాల తయారీకి పోల్ సెంటర్‌లు ఉన్నాయి. టెండర్లు నిర్వహించి ట్రాన్స్‌కో విభాగం గుత్తేదారులకు ఈ కాంట్రాక్టు అప్పగించనుంది. టెండర్ దక్కించుకున్న నిర్వాహకుడికి స్టీల్, ఇసుక ప్రభుత్వం సరఫరా చేసేది. కంకర లేబర్‌ను కాంట్రాక్టర్ స్వయంగా భరించి పోల్స్ తయారు చేస్తారు. డిపార్ట్‌మెంట్ ఇండెంట్ ఆధారంగా ఆయా ప్రాంతాలకు వాటిని తరలిస్తారు. స్థంభాల తయారీ నిర్వహణ ప్లస్ ట్రాన్సుపోర్టు ఖర్చు డిపార్టుమెంట్ చెల్లిస్తుంది. గత కొంత కాలంగా ఈ వ్యవహారం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగిస్తూ వస్తోంది.

అన్నీ మాకే...
కడపలో మద్యం బార్లు స్వాహా చేసిన తీరులోనే పోల్స్ కాంటాక్టు దక్కించుకునేందుకు టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. ఆర్థిక లావాదేవీలు కలిగిన ఏ విషయంలోనైనా టీడీపీ మద్దతు దారులు మాత్రమే ఉండాలంటూ కమలాపురంలో సరికొత్త ట్రెండ్ తెరపైకి తెస్తున్నారు. ఇప్పటికే కమలాపురంలో తమ వాడే స్థంభాల నిర్వహణ కాంట్రాక్టర్‌గా ఉండాని ఓ ప్రజాప్రతినిధి పట్టుబట్టారు. ఇప్పటివరకూ ఉన్న కాంట్రాక్టర్‌ను ఖాళీ చేయించాలని ఒత్తిడి చేశారు. ఆ మేరకు ట్రాన్సుకో ఎస్ఈ రమణ సదరు కాంట్రాక్టర్ నుంచి బలవంతంగా రాజీనామా లేఖ తీసుకున్నట్లు సమాచారం.

నామినేషన్ పద్ధతిలో వారికే అప్పగించేందుకు..
విద్యుత్తు స్తంభాల తయారీ కాంట్రాక్టు నామినేషన్ పద్ధతిలో తెలుగు తమ్ముళ్లకు అప్పగించేందుకు అధికార పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు సీఎండీపై ఒత్తిడి పెడుతున్నట్లు సమాచారం. టెండర్ నిర్వహిస్తే, ఎవరైనా పాల్గొనే అవకాశం ఉంది. అలా కాకుండా ఎలాగైనా నామినేషన్ పద్ధతిలో అప్పగించాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ఇలాంటి పద్ధతి ఎవ్వరూ చేపట్టలేదని తేల్చి చెబుతున్నా, అవేవీ పట్టించుకునే స్థితిలో అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు లేరు. కడపలో మద్యం బార్లు స్వాహా చేసినట్లుగానే విద్యుత్తు స్తంభాల తయారీ కాంట్రాక్టు మాకే దక్కాలంటూ టీడీపీ నేతలు బాహాటంగా చెప్పుకరావడం విశేషం.

ఉపాధిలో వంద రోజుల ప్రణాళిక


- ఇప్పటికే 84 శాతం ప్రగతి
- మూడు వేల కుటుంబాలకు వంద రోజుల పని
- పండ్ల తోటల లక్ష్యంలో కూడా ప్రగతి
- నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత



ఉపాధి పనులకు హాజరైన కూలీలు

కడప సిటీ: ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే పనులు ముమ్మరం చేశారు. కూలీలకు పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రణాళికను సిద్ధం చేయడమే కాకుండా అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టింది. కూలీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ఉపాధి హామీ పథకం చర్యలు చేపట్టింది. నీటి సంరక్షణ పనులతోపాటు నిర్మాణాత్మక పనులకు కలిపి ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాకు రూ. 400 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. కనీస వేతనం రూ. 272 నుంచి రూ. 300లకు కేంద్ర ప్రభుత్వం పెంచడంతో పనులపైన కూలీలు ఆసక్తి కనబరుస్తున్నారు.

లక్ష్యం 80 లక్షల పనిదినాలు
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పథకం కూలీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పనులు కూడా సమీప గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. దీంతో పనులు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వర్షాలు లేనందున ఉపాధి కూలీలు పనులకు వెళ్లేందుకు వీలు కలుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం కూలీల వేతనాలకు జిల్లాలో రూ. 240 కోట్లు ఖర్చు చేయాలన్నది లక్ష్యంగా ఉంది. ఈ మొత్తాన్ని ఈ ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి చివరికి నాటికి ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 61,50,699 పనిదినాలు నమోదయ్యాయి. దీంతో 76.88 శాతంగా నమోదైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జిల్లా ఐదవ స్థానంలో నిలిచింది. సరాసరి దినసరి వేతనం రూ. 259.58గా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటివరకు 3519 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కల్పించారు. వేతనాల కోసం రూ. 159.66 కోట్లు, మెటీరియల్ కోసం రూ. 3.20 కోట్లు, పరిపాలన ఖర్చు రూ. 11.37 కోట్లు కలిపి మొత్తం రూ. 174.24 కోట్లు ఖర్చు చేశారు.



వంద రోజుల ప్రణాళికలో భాగంగా..
వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈనెల 17వ తేదీ వరకు వివిధ పనులను నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా 16 లక్షల పనిదినాలు కల్పించడానికిగాను 14.44 లక్షల పనిదినాలు కల్పించి 85 శాతం ప్రగతి సాధించడం జరిగింది. మూడు వేల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా 3462 కుటుంబాలకు వంద రోజులు పూర్తి చేసి 115.40 శాతం సాధించడం గమనార్హం. వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటల ప్లాంటింగ్ పూర్తి చేసే లక్ష్యం కాగా, 1041 ఎకరాల్లో ప్లాంటింగ్ చేశారు. అలాగే మిగిలిన ప్లాంటేషన్ పనుల్లో కూడా ప్రగతి సాధించారు. 1367 ఎకరాల్లో ఖండిత కందకాల తవ్వకం చేపట్టారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత
ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజు 8 వేల నుంచి 9 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ప్రధానంగా నీటి సంరక్షణ పనులను చేపడుతున్నారు. కాలువల్లో పూడికతీత, ఖండిత కందకాలు, ఫారంపాండ్స్, సోకుకిట్లు, రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పండ్ల తోటల పెంపకం పనులు, బండ్ ప్లాంటేషన్, ప్రభుత్వ భవన సముదాయాలలో మొక్కల పెంపకం, ప్రభుత్వ బీడు భూముల్లో మొక్కల పెంపకం తదితర పనులు చేపడుతున్నారు.

పనుల లక్ష్యానికి చర్యలు
ఉపాధి హామీ పనుల్లో భాగంగా వివిధ పనులు చేపట్టి లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నాం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రగతి సాధించాం. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నాం. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం.
– విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి పీడీ, డ్వామా, కడప

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల జైలు శిక్ష

కడప అర్బన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన గోటూరు గంగాధర్‌కు ఏడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరి తీర్పునిచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. గోటూరు గంగాధర్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ వెళ్తుండగా.. కడప తాలూకా పోలీసులు బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేశారు. మద్యం తాగినట్లు తెలియడంతో సెక్షన్ 185 ఎం.వీ.యాక్ట్ క్రింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

గుండె పోటుతో కూలీ మృతి

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ పైడి కాలువ పెద్ద గంగులయ్య(68) శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో జయశ్రీ, ఏపీవో సుధారాణి పెద్దపుత్తలోని మృతుడి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు.

25 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు : మండలంలోని పాపాఘ్ని నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 25 ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నది నుంచి భారీగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్బీ అధికారులు దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన కొందరు ట్రాక్టర్ల డ్రైవర్లు ఇసుకను లోడ్ చేసుకున్న ట్రాక్టర్లను వదిలి పరారయ్యారు. పట్టుకున్న ట్రాక్టర్లను వల్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంజీవరాయుడు తెలిపారు.

అంగన్వాడీ వర్కర్లకు రాజకీయ వేధింపులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో పని చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్‌వాడీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్ లక్ష్మీదేవి, అంజనీదేవి డిమాండ్ చేశారు. సింహాద్రిపురం, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు, వేంపల్లి, వేముల, తదితర మండలాల్లో అంగన్వాడీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ఎవరిపై కక్ష సాధింపులు చేయకూడదని ప్రకటించినా, ఆయన మాటలు నాయకులు గౌరవించకపోవడం బాధాకరమని తెలిపారు. కొన్ని సెంటర్లలో తాళాలు వేసి వెళ్లమని చెప్పడం దారుణమన్నారు. వేధింపులు కొనసాగితే ఆందోళనచేస్తామని హెచ్చరించారు.

వంద రోజుల పాలన కార్యక్రమానికి స్పందన కరవు

బ్రహ్మంగారిమఠం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైన సందర్భంగా శుక్రవారం నుంచి ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఆధ్వర్యంలో డి.నేలటూరు పంచాయతీలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ప్రజలు సమావేశానికి రాకపోగా కనీసం ఆ పార్టీ కార్యకర్తలు హాజరు కాకపోవడంతో ఎంపీడీఓ విస్మయం చెందారు. ఇంతవరకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యా దీవెన, మహిళలకు రూ.1500 ఏమీ ఇవ్వలేదని మహిళలు ఆరోపించారు. టీడీపీకి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు మాత్రమే గ్రామ సభలో పాల్గొన్నారు. ఎంపీడీఓ మాత్రం ప్రభుత్వం పంపిన కరపత్రం చదివి వెళ్లిపోయాడు.

వంద రోజుల్లో ఒక్క మంచిపని చేశారా..?

- సంపద సృష్టిస్తానని రూ.20 వేల కోట్ల అప్పులు చేశారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వంద రోజుల పాలనలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఒక్క మంచి పనీ చేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏమీ చేయకపోయినా వంద రోజుల పరిపాలనపై కూటమి నాయకులు ఎక్కడా లేని హడావుడి చేస్తూ ఇంటింటా స్టిక్కర్లు అతికిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు తప్ప ఏమిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, వంద రోజుల్లోనే రూ.20 వేల కోట్ల అప్పులు చేశారన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.1500, తల్లికి వందనం ద్వారా రూ.15 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతు నిధి పేరుతో ప్రతి రైతుకు రూ.20 వేలు, ఏడాదికి మూడు సిలిండర్లు, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామని చెప్పి ఏ హామీ నెరవేర్చలేదన్నారు. ఇసుక స్టాక్ యార్డుల్లో 85 లక్షల టన్నుల ఇసుక ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 60 లక్షల టన్నుల ఇసుకను తెలుగు తమ్ముళ్లు మాయం చేశారన్నారు. ఫ్రీ ఇసుక అని ట్రాక్టర్‌కు రూ.2600, టిప్పర్‌కు రూ.20వేలు వసూలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను వేల కోట్లకు అమ్మకానికి పెట్టిందన్నారు. ఎన్నికల ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై ప్రజలను భయాందోళనకు గురిచేసి ఓట్లు దండుకున్నారన్నారు. 50ఏళ్లపాటు వడ్డీలేని రుణం ఇస్తామని కేంద్రం చెప్పాక యూటర్న్ తీసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్లబ్బుల్లో కూడా పేకాట ఆడనిచ్చేవారుకాదని, ఇప్పుడు టెంట్లు వేసి ఆడిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 40 మందిని హత్య చేశారన్నారు. ఆవు నెయ్యిని పరీక్షలకు పంపితే వెజ్ అవశేషాలున్నాయని రిపోర్టు ఇవ్వడంపై చంద్రబాబే సమాధానం చెప్పాలన్నారు. వరదలు వస్తాయని ప్రభుత్వానికి తెలిసినా లక్షల మందిని తరలించలేమని వదిలేశారన్నారు. ఇలా చేస్తూ పోతే చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, శ్రీరంజన్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల నేరస్థులకు న్యాయ సహాయం



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా పకృద్దీన్

పులివెందుల రూరల్ : బాల నేరస్థులకు న్యాయ సహాయం అందించడమే ఉద్దేశంగా రెండవ పాన్ ఇండియా ప్రచారం-2024 చేపట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా పకృద్దీన్ తెలిపారు. పులివెందుల సబ్ జైలును శుక్రవారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ పాన్ ఇండియా ప్రచార కార్యక్రమం కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఆ వివరాలను బ్యానర్ల రూపంలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీస్, లీగల్ ఎయిడ్ క్లినిక్, జైళ్లు, బార్ అసోసియేషన్ హాళ్లు, కోర్టుల వద్ద ప్రదర్శిస్తామన్నారు. ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లచే కరపత్రాలు పంపిణీ చేయిస్తారన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించామని, సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

వైద్యుల నిరసనలు ఉధ్భృతం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

- ప్రభుత్వంతో చర్చలు విఫలం
- 23న చలో విజయవాడకు పిలుపు

కడప రూరల్ : జీఓ 85ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. ఏపీపీహెచ్‌సీడీఏ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆందోళనబాట పట్టారు. శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణ ప్రాంతాల పీహెచ్‌సీల్లో వైద్య సేవలు స్తంభించాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ సంఘం ప్రతినిధులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర, జనరల్ సెక్రటరీ డాక్టర్ వినయ్‌కుమార్, కోశాధికారి డాక్టర్ మహమూద్ తాహర్ మాట్లాడుతూ చర్చలు విఫలమైనా, ప్రభుత్వం సానుకూల వాతావరణంలో చర్చలు జరిగినట్లు చెప్పుకోవడం తగదన్నారు. ఈ నెల 23న విజయవాడలో నిరసన తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలలో నాలుగో విడత అడ్మిషన్లు

వైవీయూ : వైఎస్ఆర్ కడప జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిన సీట్లకు నాలుగో విడతగా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.జ్ఞాన కుమార్ తెలిపారు. పది ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 26వ తేదీ తుదిగడువు అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 30న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఐటీఐల వద్దకు వెళ్లి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

తిరుపతి-షోలాపూర్ రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా షోలాపూర్-తిరుపతి-షోలాపూర్ (01437/01438) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువును డిసెంబరు 27వ తేదీ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. షోలాపూర్-తిరుపతి (01437) రైలును ఈ నెల 26వ తేదీ వరకు నడపాల్సి ఉండగా, ప్రయాణీకుల రద్దీ మేరకు డిసెంబరు 26వ తేదీ వరకు పొడిగించారన్నారు. అలాగే తిరుపతి-షోలాపూర్ (04138) నడిచే రైలును డిసెంబరు 27వ తేదీ వరకు పొడిగించారు. ఈ రైళ్లకు కడప, ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



గోడౌన్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : గంజాయి రవాణాకు పాల్పడినా, వారికి సహకరించినా చర్యలు తీసుకుంటామని డీఎన్‌సీసీ అధికారులు హెచ్చరించారు. పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోదాముల్లో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్, ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీఎన్‌సీసీ అధికారులు తెలిపారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో సీఐలు రమణారెడ్డి, యుగంధర్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో నలుగురు అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న టూటౌన్ సీఐ బి.నాగార్జున

కడప అర్బన్ : కడప నగరంలోని మాసాపేట వద్ద హిందూ శ్మశాన వాటికలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ అరెస్టు చేశారు. వారి నుంచి 4.100 కిలోల గంజాయి, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కడప గంజికుంట కాలనీలో నివాసముంటున్న షేక్ సమీర్ అహమ్మద్, అల్మాస్‌పేటకు చెందిన ఖాజీ ఆరీఫ్, గరీబ్‌షా వీధికి చెందిన షేక్ ఖదీర్, మాసాపేట దొరల గోరీల సమీపంలో నివాసముంటున్న తొతుకులక్ష్మి ఉన్నారు.

లారీలు నిలిపి నగదు దోపిడీ

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో రెండు లారీలను నిలిపి డ్రైవర్ల వద్ద నగదు, సెల్‌ఫోన్ దోచుకున్నారు. బాధితుల సమాచారం మేరకు తమిళనాడుకు చెందిన రెండు లారీలు శుక్రవారం తెల్లవారు జామున వేర్వేరు సమయాల్లో ముద్దనూరు-కడప రహదారిలో వెళ్తున్నాయి. కొత్తపల్లె సమీపంలో దొంగలు లారీలను నిలిపివేశారు. ఓ లారీలోని వ్యక్తుల నుంచి రూ.15 వేలు, మరో లారీలో ఉన్న వారి నుంచి రూ.5 వేలు, రెండు సెల్‌ఫోన్లు లాక్కెళ్లారని బాధితులు తెలిపారు.

రైల్వే జీఎంతో ఎంపీ అవినాష్‌రెడ్డి భేటీ

పలు రైళ్లను నిలపాలంటూ వినతి



సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌తో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్.అవినాష్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. రైల్ నిలయంలోని జీఎం ఛాంబర్‌లో ఆయనను కలిసి కడప పార్లమెంట్ పరిధిలోని రైల్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. హరిప్రియ ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబై ఎక్స్‌ప్రెస్ రైళ్లను కమలాపురం, ముద్దనూరు, కొండాపురం స్టేషన్లలో ఆపాలని కోరారు. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముద్దనూరు, కొండాపురంలో ఆపితే శబరిమల భక్తులు, కోయంబత్తూరులో చదివే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జమ్ముతావి-తిరుపతి హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు, చెన్నై- అహ్మదాబాద్ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కడపలో ఆపితే గుజరాత్, రాజస్థాన్ వ్యాపారులకు ఉపయోగకరమన్నారు. నంద్యాల- రేణిగుంట ప్యాసింజర్ రైలు రోజుకోసారి మాత్రమే నడుపుతున్నారని, ఇంకో రైలు నడిపితే చాలా ప్రయోజనంగా ఉంటుందన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని జనరల్ బోగీల్లో చాలా రద్దీ ఉందని, కడప- గుంతకల్, కడప- రేణిగుంట మార్గాల్లో మేము ప్యాసింజర్ రైళ్లను నడపడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లపై భారం తగ్గుతుందన్నారు. కడప, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల వారంతా వారణాసికి పోవాలంటే డైరెక్ట్ రైలు లేదని, తిరుపతి-వారణాసి ఎక్స్‌ప్రెస్ రైలును కడప, కర్నూలు, కాచిగూడ మీదుగా ప్రవేశపెట్టాలన్నారు. కడప-కాకినాడ రైలును రాయలసీమ, కోస్తా ఏరియాల మీదుగా కలుపుతూ నంద్యాల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, భీమవరం మీదుగా నడిపితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బెంగళూరుకు ఒక్క రైలు లేదని, విజయవాడ లేదా విశాఖపట్నం నుంచి గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, ముద్దనూరు, గుత్తి మీదుగా గానీ, ప్రొద్దుటూరు నుంచి ముద్దనూరు, గుత్తి మీదుగా బెంగళూరుకు కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను అమృత్ స్టేషన్‌గా గుర్తించి అభివృద్ధి పరచాలన్నారు. తిరుపతి- సికింద్రాబాద్ మార్గంలో వందే భారత్ రైలు ప్రవేశపెట్టాలని కోరారు. పుట్టపర్తి నుంచి ముదిగుబ్బ, పులివెందుల, మీదుగా ముద్దనూరుకు కొత్త రైల్వే లైన్ వేయాలని, బెంగళూరు నుంచి హౌరాకు దగ్గరి మార్గం అవుతుందని తెలిపారు. కడప రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం లిఫ్ట్ ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలని, వృద్ధులైన ప్రయాణీకులకు ఇది చాలా ఉపయోగకరమని తెలిపారు. వీటన్నింటిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ చెప్పారు.

పచ్చ పైత్యం

- నగరపాలక అధికారుల అత్యుత్సాహం
- ఎమ్మెల్యే, ఆమె భర్త ఫొటోతో సచివాలయాలకు బోర్డులు
- ప్రొటోకాల్ పాటించకపోవడంపై కార్పొరేటర్ల ఆగ్రహం



31వ వార్డు సచివాలయానికి ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు

కడప కార్పొరేషన్ : స్వామి భక్తి చాటుకునేందుకు కడప నగరపాలక సంస్థ అధికారుల అత్యుత్సాహం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నపాటుగా పచ్చ రంగులు, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఆమె భర్త ఆర్.శ్రీనివాసులురెడ్డి ఉన్న ఫొటోతో 15 సచివాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వార్డు సచివాలయాలకు కేవలం సీఎం ఫొటోతో మాత్రమే బోర్డులున్నాయి. కొన్నిచోట్ల ఉప ముఖ్య మంత్రి, స్థానిక మేయర్ ఫొటోలు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల పాలన సందర్భంగా ప్రొటోకాల్ లేని మాజీ మంత్రి ఆర్.రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి ఫొటోలు బోర్డులపై వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరపాలక సంస్థ మేయర్ సురేష్ బాబు, స్థానిక కార్పొరేటర్ల ఫొటోలు అక్కడ కనిపించవు. వీటిని కడప నగరపాలక సంస్థ అధికారులు వేయడంతో ప్రొటోకాల్ ఉల్లంఘించడమేనని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడీపీ నగర ఉపాధ్యక్షుడిపై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పీఎస్‌లో శుక్రవారం సాయంత్రం కడప నగర టీడీపీ ఉపాధ్యక్షుడు కొండాసుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యువై.జయరాముడు తెలిపారు. పాత కడపకు చెందిన అట్లూరు గోపాలకృష్ణ తన పొక్లెయినర్‌తో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో తీసుకెళ్లే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో కొండాసుబ్బయ్య ఆ స్థలానికి చేరుకుని తాను ఈ ప్రాంత లీడర్‌ను అని, తనకు చెప్పకుండా ఎందుకు మట్టిని తరలిస్తున్నారని గోపాలకృష్ణతో వాగ్వాదానికి దిగాడు. మట్టి తరలించేందుకు అనుమతులను తీసుకున్నానని చెప్పినా ఒప్పుకోకుండా పత్రాలను దౌర్జన్యంగా లాగేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కొండాసుబ్బయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

16 నుంచి ఏఐఎస్ఎఫ్ మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నవంబరు 16, 17, 18వ తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల పోస్టర్లను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాల సీట్ల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఐటీఐ, పారామెడికల్ రంగాలకు నిధులు కేటాయించాలన్నారు. నీట్, నెట్ పరీక్ష పత్రాలు లీక్ కావడం, యూనివర్సిటీ కేంద్రాల్లో విద్యార్థులపై దాడులు జరగడం చూస్తే విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందన్నారు. జిల్లా నాయకులంతా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి లీలాకృష్ణ, నగర అధ్యక్ష కార్యదర్శులు డి.అభిరానందన్, తేజ, నగర ఉపాధ్యక్షుడు చంద్ర, వంశీ, నగర నాయకులు మహేష్, గణేష్, మహేష్‌యాదవ్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్ష



నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

కలసపాడు : కలసపాడు పరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు కారణమైన కేసులో ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ చిరంజీవి వివరాల మేరకు.. పంజగల వెంకటలక్ష్మమ్మ తన భర్త మరణించడంతో కుమార్తెతో కలిసి కలసపాడు మండలం దూలంవారిపల్లెలో జీవిస్తోంది. తన పెద్ద కుమార్తె భర్తతో అక్రమ సంబంధం ఉందంటూ సమీప బంధువులు దూషించి కొట్టి వేధించడంతో వెంకటలక్ష్మమ్మ మనస్తాపం చెందారు. 2014 అక్టోబరు, 16న విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె చిన్న కుమార్తె మల్లేశ్వరి కలసపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ ఆదివలి కేసు నమోదు చేశారు. వెంకటలక్ష్మమ్మను వేధించి ఆమె ఆత్మహత్యకు కారకులైనట్లు సాక్ష్యాధారాలతో నిరూపితం కావడంతో నిందితులు పంజగల వీరయ్య, పంజగల పెద్దవీరమ్మ, పంజగల వెంకటసుబ్బమ్మ, పంజగల పెద్ద వెంకటయ్య, పంజగల వెంకట రామయ్య, పంజగల వీరమ్మలకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. నేరస్తులకు శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నవంబరులో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్



ఆర్మీ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

వైవీయూ : కడప నగరంలో ఈ ఏడాది నవంబరులో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ఎన్‌సీసీ కేడెట్స్ సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్ సూచించారు. నగరంలోని తెలుగుగంగ కాలనీలోని ఏడో కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేజర్ అమర్‌దీప్ మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఎన్‌డీఏ, ఐఎంఏ, అగ్నివీర్ విభాగాల్లో ఎంపికలకు నిర్వహించే ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలపై కేడెట్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ కిషన్‌దత్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ పసుపుల రాజశేఖర్, సీటీఓలు పవన్‌కుమార్, సురేంద్రనాయక్, హైదర్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సీఎల్.రెడ్డి, కొండారెడ్డి, సందీప్ సింగ్, బస్ నెట్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు



ఇసుక రవాణాపై సూచనలిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

వీరపునాయునిపల్లె : నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని పిల్లివారిపల్లె వద్ద ఇసుక దంపును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన వారంతా తమ పరిధిలోని సచివాలయంలో రికార్డులు, నగదు సమర్పించి రసీదు పొందాలన్నారు. రసీదు డంపింగ్ వద్దకు తీసుకెళ్తే ఇసుక నింపుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి, ఆర్‌ఐ భగీరథరెడ్డి, వీఆర్‌ఓ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ నేత బీటెక్ రవి

వేంపల్లె : చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వేంపల్లిలో తలిశెట్టి సుబ్రహ్మణ్యం జడ్పీ బాలురోన్నత పాఠశాలలో 38వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేంపల్లె ఆట స్థలంలో క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివ మునెమ్మ, నారాయణమ్మ, పీఈటీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని స్టేట్ బ్యాంకులో నకిలీ బంగారంతో రుణం తీసుకున్న కేసులో పాతకోట వెంకటరమణ, బొంత శివకుమార్, షేక్ అబ్దుల్‌ఖాదర్లను టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గతేడాది జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులను తాజాగా అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.